సాక్షి తూర్పుగోదావరి

సోమవారం । 5 । జూన్ । 2023



రూ.1,00,116 విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి అడ్డాల లక్ష్మీనరసింహ దివాకర్ (హైదరాబాద్ చందానగర్) ఆదివారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



సాగుకు 1,300 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 1,300 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 800, పశ్చిమ డెల్టాకు 500, సముద్రంలోకి 10,019 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.80 అడుగులకు చేరింది.

గరిష్టం/కనిష్టం
42.0° / 29.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	42.0	29.5
కాకినాడ	37.4	29.5
అమలాపురం	41.5	29.0

న్యూస్‌రీల్

కొనసాగుతున్న హెల్ప్‌డెస్క్



రైల్వే స్టేషన్‌లో కొనసాగుతున్న హెల్ప్‌డెస్క్

రాజమహేంద్రవరం సిటీ: కోరమండల్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదం నేపథ్యంలో స్థానిక ప్రధాన రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను అధికారులు కొనసాగిస్తున్నారు. ఒడిశాలో ప్రమాదానికి గురైన కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో రాజమహేంద్రవరం వరకూ రిజర్వేషన్ చేయించుకున్న 31 మందిలో నలుగురు ప్రయాణికుల ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. వీరి కోసం హెల్ప్‌డెస్క్‌కు ఎటువంటి ఫోన్ కాల్స్ రాలేదు. ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నంత వరకూ హెల్ప్‌డెస్క్‌ను కొనసాగిస్తామని రైల్వే అధికారులు చెప్పారు. ఇదిలా ఉండగా కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదం కారణంగా విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ నగరాలకు నడిచే 12 రైళ్లను ఈ నెల 9వ తేదీ వరకూ రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం నుంచి వివిధ రైళ్లకు రిజర్వేషన్లు చేయించుకున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత్యంతరం లేక పలువురు ఆర్టీసీ కాంప్లెక్స్ బాట పట్టారు. ప్రయాణికుల రద్దీ పెరడగంతో ఆర్టీసీ అధికారులు హైదరాబాద్‌కు 4, భద్రాచలం 2, విశాఖపట్నానికి 7 చొప్పున ప్రత్యేక బస్సులు నడిపారు.

పాలిసెట్ కౌన్సెలింగ్

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ కౌన్సెలింగ్ కొనసాగుతోంది. సర్టిఫికెట్ల పరిశీలనకు ఆదివారం 116 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్, పాలిసెట్ కన్వీనర్ వి.నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం 1,08,001 నుంచి చివరి ర్యాంకు వరకూ ఉన్న విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన వారు వివిధ కళాశాలల్లో పాలిటెక్నిక్ కోర్సుల ఎంపికకు ఆప్షన్ల నమోదు చేసుకోవాలని నాగేశ్వరరావు కోరారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయానికి త్వరలో భూమి పూజ



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి త్వరలో భూమి పూజ చేయనున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం సమీపాన పార్టీ కార్యాలయం నిర్మించనున్న స్థలాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ కార్యాలయాన్ని అన్ని సౌకర్యాలతో నిర్మించి, త్వరితగతిన అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. పునర్విభజన అనంతరం ఏర్పడిన ప్రతి జిల్లాలోనూ వైఎస్సార్ సీపీ కార్యాలయాల ఏర్పాటుకు అధిష్టానం నిర్ణయం తీసుకుందని, ఇందులో భాగంగానే రాజమహేంద్రవరంలో కూడా నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రజా హృదయాలను గెలుచుకున్న వైఎస్సార్ సీపీ రాష్ట్రంలోనే బలమైన రాజకీయ పార్టీగా అవతరించిందన్నారు. వినూత్న సంక్షేమ పథకాలతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే నంబర్ వన్ ముఖ్యమంత్రిగా నిలిచారని రాజా అన్నారు.

విద్యుత్ ఉద్యోగుల బదిలీలు

రాజమహేంద్రవరం సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పలువురు విద్యుత్ శాఖ ఉద్యోగులు బదిలీ అయ్యారు. బదిలీ అయిన వారిలో ఈఈ, డీఈఈలు, ఏఈలు, జూనియర్ ఇంజినీర్లు, జేఏఓలు నలుగురు, సీనియర్ అసిస్టెంట్లు నలుగురు, జూనియర్ అసిస్టెంట్లు 15 మందితో పాటు లైన్‌మన్‌లు కూడా ఉన్నారు. విద్యుత్తు శాఖలో కొత్తగా రాజమహేంద్రవరం రూరల్, పెద్దాపురం డివిజన్లు ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు.

17 నుంచి మరిడమ్మ తల్లి ఆషాఢ మాస ఉత్సవాలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే వేల్పుగా ఖ్యాతికెక్కిన పెద్దాపురం మరిడమ్మ అమ్మ వారి ఆషాఢ మాస ఉత్సవాలు జాతర ఈ నెల 17 నుంచి వచ్చే నెల 24వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఈ ఉత్సవాలను ఈ ఏడాది మరింత వైభవంగా జరుపుతామని పేర్కొన్నారు. 17వ తేదీ రాత్రి అమ్మవారి జాతర ప్రారంభమవుతుందన్నారు. అమ్మవారి ఆలయంలో హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కిస్తామని తెలిపారు.

చేద్దాం.. ప్రకృతికి ప్రణామం

- నేల, నీరు, గాలికి నిత్యం హాని
- ఆధునిక జీవన విధానంతో చేటు
- తోడవుతున్న మానవ నిర్లక్ష్యం
- తక్షణ చర్యలతోనే పరిరక్షణ
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: నింగి నుంచి నిప్పులు కురిపిస్తున్నాయా అనే స్థాయిలో చండప్రచండమైన ఎండలు.. ఏరూ, ఊరూ ఏకం చేసేట్టుగా కుండపోత వానలు.. మండు వేసవిలోనూ హిమపాతాలు.. బీభత్సంగా ముంచెత్తే వరదలు.. ప్రళయభీకర గాలులు.. మునుపెన్నడూ చూడని ఈ మార్పులు.. సమస్త మానవాళికీ ప్రకృతి చేస్తున్న హెచ్చరికలు. జీవరాశి మనుగడకు అత్యంత కీలకమైన నింగి, నేల, నీరు, గాలి వంటి వాటికి మనిషి తెలిసో తెలియకో హాని చేస్తూనే ఉన్నాడు. యథేచ్ఛగా కాలుష్య జలాలు కలిపేస్తూ జలావరణానికి.. వాహనాలు, పరిశ్రమల పొగలతో వాతావరణానికి.. ప్లాస్టిక్, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందుల వాడకంతో భూమాతకు చేటు తెస్తూనే ఉన్నాడు. ఇవన్నీ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నా.. మార్పు తెచ్చుకునేందుకు నిరాకరిస్తున్నాడు. తప్పెక్కడ జరుగుతోందో నిజాయితీగా గుర్తిస్తేనే.. సరి చేసుకునే స్పృహ కూడా కలుగుతుంది. జూన్ 5– ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం. ఈ సందర్భంగానైనా కాలుష్య నివారణకు, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రతిన బూనాలి.

కాలుష్యం కోరల్లో ఉమ్మడి 'తూర్పు'

- దక్షిణ కాశీగా పేరొందిన గోదావరి తీర నగరం రాజమహేంద్రవరంలో కాలుష్య భూతం కోరలు చాచుతోంది. ఇక్కడి పేపరు మిల్లు పావన జీవనది గోదావరి చెంతనే ఉంది. ఈ మిల్లు నుంచి విడుదల చేస్తున్న వ్యర్థా జలాలను వెంకటనగరం, తూర్పు లంక వద్ద గోదావరిలో కలుపుతున్నారు. దీనికి దిగువన కోటిలింగాల రేవులోని మున్సిపల్ వాటర్ ఇన్‌టేక్ పాయింట్ వద్దకు ఈ వ్యర్థ జలాలు చేరుతున్నాయి. దీనికి నగరం నుంచి ప్రతి రోజూ వస్తున్న మురుగు నీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు తోడవుతున్నాయి. వీటన్నింటి ఫలితంగా తల్లి గోదావరి కాలుష్యం కాటుకు గురవుతోంది. ఈ జలాలపై ఆధారపడి గోదావరి దిగువన వందలాది గ్రామాలున్నాయి.
- కాకినాడ పరిసర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో భారీ, మధ్యతరహా పరిశ్రమలున్నాయి. వీటి నుంచి వెలువడుతున్న వ్యర్థాలను కొన్నిచోట్ల ఇష్టానురీతిన పడేస్తున్నారు. ఈ పరిశ్రమల్లో వాయు కాలుష్యాన్ని తగ్గించాల్సి ఉంది. వీటి నుంచి వచ్చే పొగను రాత్రి ఏడు గంటల తరువాత నేరుగా బయటకు వదిలేస్తున్నారని పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా వాకలపూడి, వలసపాకల, సూర్యారావుపేట తదితర ప్రాంతాల ప్రజలు నిత్యం వాయు కాలుష్యాలతో నరకం చవిచూస్తున్నారు. జిల్లా పరిధిలోని పలు గోదావరి కాలువలు కూడా ఆయా గ్రామాలు, పట్టణాల నుంచి వస్తున్న మురుగు నీటితో కలుషితమవుతున్నాయి.
- అందాల కోనసీమలో సైతం కాలుష్యం కోరలు చాచుతోంది. ఇక్కడి తీర గ్రామాల్లో చమురు సంస్థలు సాగిస్తున్న అన్వేషణతో భూగర్భ జలాలు దాదాపు కలుషితమైపోయాయి. నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా జరుగుతున్న ఆక్వా సాగు కూడా దీనికి తోడవుతోంది. గోదావరి జలాలు, పంట కాలువలు, పంట బోదెలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి దర్శనమిస్తున్నాయి.
- నగరాలు, పట్టణాలు, ఒక మోస్తరు పల్లెల్లో శబ్ద కాలుష్యం గురించి చెప్పనవసరమే లేదు.

ప్రభుత్వం కృషి

పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోంది. గత ఏడాది జూన్ నెలలో 'జగనన్న పచ్చతోరణం' కార్యక్రమం ద్వారా ఉపాధి హామీ పథకంలో అవెన్యూ ప్లాంటేషన్‌ను ప్రోత్సహించింది. దీని ద్వారా గ్రామాల్లో రోడ్ల వెంబడి కిలోమీటరుకు 400 మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

పచ్చని చెట్లే శ్రీరామరక్ష

పర్యావరణ పరిరక్షణలో కీలకమైనవి అధిక వయస్సు ఉన్న వృక్షాలు. ఒక చెట్టు ఏడాదికి 2.5 సెంటీమీటర్ల వ్యాసం పెరుగుతుందని అంచనా. తద్వారా దాని వయస్సును లెక్కిస్తారు. ఒక చెట్టుకు 12 కేజీల కాండం ఉంటే అది 44 కేజీల కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకుంటుంది. జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో రూపొందించిన 'బయోడైవర్సిటీ' అనే పుస్తకంలో కాకినాడతో పాటు పరిసర ప్రాంతాల్లో 100 ఏళ్లకు పైబడిన వయస్సు కలిగిన వృక్షాల జాబితా, ప్రదేశాలు గుర్తించారు.

ప్రమాదకరంగా ఈ–వ్యర్థాలు

మరోపక్క ఎలక్ట్రానిక్ వ్యర్థాల (ఈ–వ్యర్థాలు) సమస్య మరింత ప్రమాదరకంగా మారింది. పనికిరాని ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్లు, కంప్యూటర్లు, ఎల్‌ఈడీ లైట్లు, జిరాక్స్ వంటి ఈ–వ్యర్థాలను దీర్ఘకాలం పాటు నిల్వ చేయడం వల్ల క్యాన్సర్, ఊపిరితిత్తులు, కాలేయం, మెదడువాపు తదితర సమస్యలు తలెత్తుతున్నా నిర్లక్ష్యం చేస్తున్నారు. మూడేళ్ల క్రితం కాకినాడ నగరపాలక సంస్థ ఈ–వ్యర్థాలను పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ కీ పర్సన్ ప్రక్రియ ద్వారా రీసైక్లింగ్ చేసి కోల్‌కతాకు చెందిన సంస్థకు పంపేలా చర్యలు చేపట్టింది. దీనిని మరింత సమర్థంగా కొనసాగించాల్సి ఉంది.

ప్లాస్టిక్‌తో ముప్పు

మరోపక్క ప్లాస్టిక్ విచ్చలవిడి వినియోగం ప్రమాదకరంగా మారింది.

కాకినాడ, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థల్లో ప్లాస్టిక్ వాడకాన్ని దశల వారీగా నిషేధిస్తామని చెప్పినా కార్యరూపం దాల్చలేదు. అధికారులు తూతూమంత్రంగా దాడులు చేయడం.. ఆనక విడిచి పెట్టేయడంతోనే ఈ పరిస్థితి అని పర్యావరణవేత్తలు అంటున్నారు.

ఎన్నో చట్టాలు

పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ఎన్నో చట్టాలున్నాయి. జలవనరుల్లో వ్యర్థాలను పడేస్తే జల కాలుష్య నివారణ చట్టం–1974, మితిమీరిన శబ్దాలతో వాహనాలు నడపడం, వాటివలన వాయు కాలుష్యం జరిగితే వాయు కాలుష్య నివారణ చట్టం–1981, అడవుల నరికివేతకు పాల్పడితే అటవీ సంరక్షణ చట్టం–1980, ప్లాస్టిక్, రసాయనిక ఎరువులతో పరిసరాలను కలుషితం చేస్తే వాతావరణ పరిరక్షణ చట్టం–1981 ప్రకారం శిక్షలుంటాయి.

ఇవి పాటిస్తే మేలు

- నీటిని పొదుపుగా వాడాలి.
- ఒకసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ వద్దు.
- ఈ–వ్యర్థాలను తగ్గించాలి.
- సుస్థిర ఆహార పద్ధతులు, ఆరోగ్యకర జీవన శైలి అలవరచుకోవాలి.



పత్ర విలాపం



ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా రామచంద్రపురం మండలం నరసాపురపుపేటకు చెందిన డ్రాయింగ్ టీచర్ రాయుడు త్రినాథ్ ప్రసాద్ 'పత్ర విలాపం' చిత్రం గీశారు. చెట్లను నరికివేస్తుంటే ఆ చెట్ల ఆకులు విలపిస్తున్న తీరును తన చిత్రంలో ఆయన తెలియజెప్పారు.
– రామచంద్రపురం రూరల్

కాలుష్య నియంత్రణ మండలి నిర్ధారించిన వాయు కాలుష్యం ఇలా..

సెంటర్	పీఎం 10	పీఎం 2.5
కాకినాడలో..		
రమణయ్యపేట	68	25
సూర్యారావుపేట	80	27
సాలిపేట మీసేవ	67	22
జేఎన్‌టీయూకే	60	-
సాధారణం	69	25
స్టాండర్డ్స్	60	40
రాజమహేంద్రవరంలో..		
ఏపీ పేపర్ మిల్లు	76	26
గెయిల్, ఏవీ అప్పారావు రోడ్డు	68	-
జిల్లా ఆస్పత్రి	61	-
గోదావరి గట్టు	71	-
ఆనం కళాకేంద్రం	68	30
సాధారణం	68	28

సాధారణంగా గాలిలో ధూళికణాల పర్టిక్యులర్ మేటర్ (పీఎం–10), పీఎం–2.5లు 60కి మించకూడదు. కాకినాడ, రాజమహేంద్రవరం నగరాలతో పాటు అమలాపురంలో సైతం ధూళి కణాలు 65 దాటి ఉంటున్నాయని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీ పీసీబీ) గుర్తించింది. దీనిని తగ్గించుకోకుంటే భవిష్యత్‌లో ప్రమాదరకమేనని అంటున్నారు.

జీవన శైలిలో మార్పుతో..



పర్యావరణ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం 'మిషన్ లైఫ్' అనే కొత్త నినాదంతో ఈ ఏడాది కార్యక్రమాలు చేపడుతోంది. జీవన శైలిలో మార్పుతోనే పర్యావరణాన్ని పరిరక్షించగలం. పదేళ్ల క్రితం పర్యావరణంలో పీపీఎం (పార్ట్ ఫర్ మిలియన్) 350 ఉండేది. ఇప్పుడది 420 వరకూ పెరిగింది. 350 ఉంటే పర్యావరణం, ఉష్ణోగ్రతలు సమపాళ్లలో ఉన్నట్టు. అంతకు మించితే ప్రమాద హెచ్చరికే.

– ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ క్లైమేట్ చేంజ్ మాజీ సభ్యుడు, జేఎన్‌టీయూకే

మన చేతుల్లోనే ఉంది



పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు చేసే చట్టాలు, నిబంధనలు అమలు చేయడం అనేది మన చేతుల్లోనే ఉంది. కానీ ఆ విషయాన్ని మనం పట్టించుకోవడం లేదు. దీనివల్ల కర్బన ఉద్గారాలు పెరిగి, పర్యావరణ సమతుల్యత దెబ్బ తింటోంది. దీనివల్ల తీవ్ర తుపాన్లు, భారీ వరదలు ముంచెత్తుతున్నాయి.

– పెచ్చెట్టి కృష్ణకిషోర్, కోనసీమ కాలుష్య అధ్యయనకర్త, అమలాపురం

అవగాహనతోనే పర్యావరణ పరిరక్షణ



అవగాహనతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం. నేలలో ప్లాస్టిక్ ధాతువులు కలిసేందుకు చాలా సంవత్సరాలు పడుతుంది. ప్లాస్టిక్ కవర్లకు బదులు కాగితం, క్లాత్ కవర్లు వినియోగించుకోవాలి. వాయు కాలుష్య నివారణకు ప్రతి ఇంటా మొక్కలు పెంచాలి. పారిశ్రామిక రసాయన వ్యర్థాలను నదులు, కాలులు, సముద్రాల్లోకి నేరుగా విడిచిపెట్టకుండా వాటర్ ట్రీట్‌మెంట్ చేయాలి. పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నాం.

– ఎస్.అశోక్‌కుమార్, ఈఈ, కాలుష్య నియంత్రణ మండలి, కాకినాడ

రూ.35 లక్షలకు టోకరా



ధవళేశ్వరం: యూట్యూబ్ చానల్ సబ్‌స్క్రైబ్ చేసి, పెట్టుబడి పెడితే 30 శాతం కమీషన్ ఇస్తానంటూ నమ్మబలికి రూ.35 లక్షలకు టోకరా వేశారు సైబర్ మోసగాళ్లు. ధవళేశ్వరం పోలీసుల కథనం ప్రకారం .. ధవళేశ్వరం లక్ష్మీనరసింహ నగర్‌కు చెందిన వెల్నాటి శ్రీహరి రైల్వేలో పని చేస్తున్నాడు. యూట్యూబ్ చానల్ సబ్‌స్క్రైబ్ చేయాలని గత నెల 14న అతడికి వాట్సాప్ మెసేజ్ వచ్చింది. సబ్‌స్క్రైబ్ చేసిన అనంతరం రూ.5 వేలు వేస్తే 30 శాతం కమీషన్ ఇస్తామని నమ్మబలికారు. తొలుత శ్రీహరి పలు దఫాలు రూ.5 వేలు జమ చేయగా అతని అకౌంట్‌లో రూ.6,500 చొప్పున వేశారు. ఇది నమ్మిన శ్రీహరి దఫదఫాలుగా రూ.35,23,440 జమ చేశారు.

అయితే అతడికి ఎటువంటి సొమ్మూ తిరిగి రాకపోవడంతో మోసపోయానని గ్రహించి, ఆదివారం ధవళేశ్వరం పోలీసులను ఆశ్రయించాడు. సీఐ కె.మంగాదేవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అతివలకు అండదండలు

- మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం చేయూత
- జిల్లాలో 200 యూనిట్ల స్థాపనే లక్ష్యం
- 29 యూనిట్లకు రుణాలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఇంటిని అత్యంత సమర్థంగా నిర్వహించే మహిళలకు పరిశ్రమల నిర్వహణలో తగిన ప్రోత్సాహం ఇస్తే మంచి ఫలితాలు వస్తాయని ప్రభుత్వం గట్టిగా నమ్ముతోంది. ఇందులో భాగంగానే జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను గుర్తించి, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నారు. తద్వారా మహిళల ఆధ్వర్యాన చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఆయా మహిళలకు ఏ వ్యాపారంలో అనుభవం ఉంది, దేనికి మార్కెట్ ఉంది, ఎలా మార్కెట్ చేసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో 200 యూనిట్లు స్థాపించే లక్ష్యంతో కలెక్టర్ కె.మాధవీలత ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా 29 యూనిట్లకు రూ.కోటి పైగా సబ్సిడీతో రుణాలు మంజూరు చేయించారు.

- నిడదవోలు పందలపర్రు గ్రామానికి చెందిన ఆకుల సూర్యప్రకాశదేవి జూట్ బ్యాగ్ తయారీ పరిశ్రమపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో పాటు హైదరాబాద్‌లో మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) ద్వారా మరింత సమాచారం పొందారు. అక్కడ జరిగిన అవగాహన కార్యక్రమాలకు కూడా హాజరయ్యారు. అన్ని విషయాలూ క్షుణ్ణంగా తెలుసుకున్న తరువాత తాను పరిశ్రమ స్థాపించగలననే ఆత్మవిశ్వాసం పొందారు. సూర్యప్రకాశదేవికి అధికార యంత్రాంగం రూ.50 లక్షల బ్యాంక్ రుణం మంజూరు చేసింది. లబ్ధిదారు వాటా రూ.2.50 లక్షలు కాగా, ప్రభుత్వం రూ.17 లక్షల సబ్సిడీ ఇచ్చింది. ఈ జూట్ బ్యాగ్ పరిశ్రమ ద్వారా సుమారు 50 మంది మహిళలకు ఉపాధి లభించనుంది.
- అలాగే, రాజానగరానికి చెందిన గాడి విమల పేపర్ ప్లేట్ బిజినెస్ కోసం రూ.5 లక్షల రుణం పొందారు. ఇందులో ప్రభుత్వం రూ.1.75 లక్షల సబ్సిడీ ఇచ్చింది. ఆమె ద్వారా మరో నలుగురికి ఉపాధి లభించింది.
- రాజానగరానికే చెందిన కురంగి సూర్యకుమారికి జిరాక్స్ మెషీన్ కోసం రూ.2 లక్షల సబ్సిడీతో ప్రభుత్వం రుణం మంజూరు చేసింది. దీని ద్వారా మరో ముగ్గురికి ఉపాధి లభిస్తోంది.
- చిన్నతరహా పరిశ్రమల వలన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఆర్థికంగా లాభం పొందడమే కాకుండా మరికొంత మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం ఈ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రోత్సాహం అందిస్తోంది.



పేపర్‌ప్లేట్ తయారీ మెషీన్‌పై అవగాహన కల్పిస్తున్న గాడి విమల

ఏరువాక సాగారో..

- పంట పొలాల్లో రైతుల పూజలు
- ఖరీఫ్ సాగుకు శ్రీకారం
- ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసిన అధికారులు



కొవ్వూరులో నారుమడి కోసం దమ్ము చేస్తున్న రైతు

కొవ్వూరు: ఏరువాక పౌర్ణమి సందర్భంగా అన్నదాతలు ఆదివారం పొలం బాట పట్టారు. వ్యవసాయ పనిముట్లకు, భూమి తల్లికి పూజలు చేసి ఖరీఫ్ సాగుకు శ్రీకారం చుట్టారు. జ్యేష్ఠ పౌర్ణమి రోజున పొలం దుక్కి దున్ని, వర్షాలు బాగా కురిసి, పంటలు బాగా పండాలని మొక్కుకోవడం రైతులకు ఆనవాయితీ. ప్రస్తుతం జిల్లాలో ఖరీఫ్ సాగుకు సానుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. నైరుతి రుతుపవనాలు ఒకటి రెండు రోజుల్లో కేరళను తాకే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు గోదావరి డెల్టాకు ఈ నెల 1న సాగునీరు విడుదల చేశారు. ఈ నెల ఏడో తేదీతో రోహిణీ కార్తె ముగియనుంది. 8వ తేదీ నుంచి మృగశిర కార్తె రానుండటంతో వాతావరణం కాస్త చల్లబడే అవకాశం ఉంది. ఇప్పటికే రైతులు ముమ్మరంగా నారుమళ్లు పోస్తున్నారు. ఇది ఈ వారంలో మరింత ఊపందుకోనుంది. మరోవైపు జిల్లా అధికారులు సైతం ఖరీఫ్ ముందస్తు సాగుకు కార్యాచరణ సిద్ధం చేశారు. రైతుల్లో అవగాహన కల్పించారు. ఈ ఏడాది జూన్‌లో వర్షాలు అంతంత మాత్రంగానే కురిసే అవకాశముందని వాతావరణ శాఖ చెబుతోంది. ఈ నేపథ్యంలో రైతులు చేపట్టిన ముందస్తు సాగు సత్ఫలితాలు ఇచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,20,705 హెక్టార్లలో (2,99,348 ఎకరాలు) రైతులు వివిధ వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. అత్యధికంగా వరి సాగు జరుగుతోంది. మినుము, చెరకు, మిర్చి, వేరుశనగ, మొక్కజొన్న, కంది, పత్తి, పసుపు వంటి పంటలను ఖరీఫ్‌లో సాగు చేస్తున్నారు.

10 శాతం పూర్తయిన నారుమళ్లు

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో వరి సాధారణ సాగు విస్తీర్ణం 78,769 హెక్టార్లు. మొత్తం 3,900 హెక్టార్లలో నారుమళ్లు పోయాల్సి ఉండగా, ఇప్పటి వరకూ సుమారు 10 శాతం ఆయకట్టులో ఈ ప్రక్రియ పూర్తయ్యిందని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా కొవ్వూరు, చాగల్లు మండలాల్లో 30 శాతం ఆయకట్టులో నారుమళ్లు పూర్తి చేశారు. నిడదవోలులో 20 శాతం, తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట, పెద్దేవం, మలకపల్లి, రావూరుపాడు తదితర గ్రామాల్లో 10 శాతం ఆయకట్టులో నారుమళ్లు పూర్తయ్యాయి. గోదావరి పశ్చిమ డెల్టా కాలువకు నీరు విడుదల చేయడంతో ఉండ్రాజవరం, పెరవలి, నిడదవోలు మండలాల్లోనూ నారుమళ్లు పోసేందుకు రైతులు మురగ దమ్ములు చేస్తున్నారు. రాజానగరం, బిక్కవోలు, సీతానగరం మండలాల్లో కూడా నారుమళ్లు ప్రారంభమయ్యాయి. గోపాలపురం, నల్లజర్ల, దేవరపల్లి, కోరుకొండ, గోకవరం తదితర మెట్ట ప్రాంత మండలాల్లో దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. వర్షాలు పడి కాస్తా వాతావరణం చల్లబడిన తర్వాతే నారుమళ్లు పోస్తారు. బోర్లు ఉండి, నీటి వసతి సమృద్ధిగా ఉన్నచోట్ల మాత్రం మురగ దమ్ములు చేసుకుంటున్నారు.

సమృద్ధిగా సాగునీటి వనరులు

జిల్లాలో అత్యధిక సాగుభూమి మెట్ట ప్రాంతంలోనే ఉంది. సుమారు 60 శాతం (1,77,927 ఎకరాలు) బోర్లపై, 18 శాతం గోదావరి డెల్టాలో, 11 శాతం చెరువుల కింద, మరో 11 శాతం ఎత్తిపోతల పథకాల పరిధిలో సాగు చేస్తున్నారు. జిల్లాలో 22,543 హెక్టార్లు మాత్రమే వర్షాధారంగా సాగవుతోంది. జిల్లా వ్యాప్తంగా 15 ఎత్తిపోతల పథకాలున్నాయి. బోర్లు ఉన్న ఆయకట్టులో కూడా కొంతమేర ఈ పథకాల ద్వారా సాగునీరు అందుతోంది. దీంతో సాగునీటి సమస్య తలెత్తే పరిస్థితి లేదు. గోదావరిలోనూ పుష్కలంగా జలాలుండటంతో డెల్టాలో సాగునీటికి ఢోకా లేదు. పశ్చిమ డెల్టా కాలువలపై ఆధారపడి 54,600 ఎకరాలు సాగు చేస్తున్నారు. ఉండ్రాజవరం, నిడదవోలు, పెరవలి మండలాలు, రాజమహేంద్రవరం రూరల్, కడియంలో పాక్షికంగా కొన్ని గ్రామాలు గోదావరి డెల్టా పరిధిలో ఉన్నాయి. ధవళేశ్వరం ఆనకట్టకు చేరువలోనే ఉండడంతో ఈ మండలాల్లో నీటి ఎద్దడి సమస్యే ఉండదు. మెట్ట ప్రాంతంలో చెరువుల ద్వారా 33,227 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇప్పటికే గోదావరి డెల్టాకు సాగునీరు విడుదల చేయగా, ఈ నెల 7న వెంకటనగరం పంపింగ్ స్కీమ్, 14న తొర్రిగెడ్డ, 15న చాగల్నాడు, 25న ఎర్రకాలువ, 12న కొవ్వాడ రిజర్వాయర్, 22న పుష్కర, జూలై 1న ముసురుమిల్లి ప్రాజెక్టు, జూలై మొదటి వారంలో సూరంపాలెం, తాడిపూడి ఎత్తిపోతల పథకాల నుంచి నీరు విడుదల చేయాలని జిల్లా నీటి పారుదల సలహా మండలిలో నిర్ణయించారు.




కొవ్వూరు మండలం పశివేదల గ్రామంలో నారుమడి

అందుబాటులో ఎరువులు, విత్తనాలు

ఖరీఫ్ సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలను అధికారులు ఇప్పటికే రైతుభరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) సిద్ధంగా ఉంచారు. ఖరీఫ్‌లో వెయ్యి క్వింటాళ్ల విత్తనాలను ఏపీ సీడ్స్ ద్వారా సరఫరా చేయాలని నిర్ణయించారు. దీనిలో ఇప్పటికే 400 క్వింటాళ్ల విత్తనాలను ఆర్‌బీకేల్లో సిద్ధంగా ఉంచారు. అలాగే అన్ని రకాల ఎరువులు కలిపి 750 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచారు. జిల్లాలో అన్ని రకాలూ కలిపి 62 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అంచనా వేశారు. దీనిలో ఆర్‌బీకేల ద్వారా 19 వేల మెట్రిక్ టన్నులు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు.

దంప ఆకుమడులే మేలు



మురగ దమ్ము చేసుకుని దంప ఆకుమళ్లు (నారుమళ్లు) పోసుకుంటే 20 రోజుల్లోనే నాట్లకు నారు సిద్ధమవుతుంది. మెట్టలో నారుమడి పోసుకుంటే 25 నుంచి 30 రోజులు పడుతుంది. ఎకరానికి 25 కిలోల విత్తనాలు సరిపోతాయి. బెంగాలీ కూలీలతో నాట్లు వేయిస్తే 15 నుంచి 16 కిలోల విత్తనాల నారు సరిపోతుంది. నారుమడిలో సేంద్రియ ఎరువు వేసుకోవడం మంచిది. విత్తనాలు వేసే సమయంలో యూరియా రెండు కిలోలు, సూపర్‌ఫాస్ఫేట్ 6.250 కిలోలు, పొటాషియం 1.7 కిలోల చొప్పున వేసుకోవాలి. 12 రోజుల తర్వాత యూరియా వేసుకుంటే సరిపోతుంది. భూమిలో జింకు లోపం ఉంటే విత్తనం వేసిన పది రోజుల తర్వాత వారం వ్యవధిలో రెండుసార్లు లీటరు నీటిలో 2 గ్రాముల జింకు సల్ఫేట్ కలిపి పిచికారీ చేసుకోవాలి.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ అధికారి



క్లుప్తంగా

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఐఐటీల్లో ప్రవేశాలకు సంబంధించి జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్-2023 పరీక్ష కాకినాడ అయాన్ ఇనిస్టిట్యూట్ కేంద్రంలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఐఐటీ గౌహతి పరీక్ష ఆన్‌లైన్ విధానంలో నిర్వహించింది. ఉదయం నిర్వహించిన పరీక్షకు 462 అభ్యర్థులకు గాను 454 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 462 మందికి 452 మంది వచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఆలమూరు: మండలంలోని కొత్తూరు సెంటర్ నుంచి అంగర వెళ్లే మార్గం మధ్యలో పెద్దపళ్ల గ్రామ సరిహద్దు వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై ఎస్.శివప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండపేట మండలం కేశవరంలోని ఓ ఫర్నిచర్ షాపులో కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లికి చెందిన సుంకర బాబాప్రసాద్ (30) పని చేస్తున్నాడు. పని ముగించుకుని ఇంటికి మోటారుసైకిల్‌పై వస్తుండగా పెద్దపళ్ల సరిహద్దు వద్ద సంధిపూడి వైపు నుంచి కొత్తూరు సెంటర్‌కు వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొంది. దీంతో బాబాప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివప్రసాద్ తెలిపారు.

చిట్టీల మోసంపై కేసు

కరప: చిట్టీల పేరుతో, అధిక వడ్డీ ఎరచూపి రూ.1.50 కోట్లకు కుచ్చుటోపీ పెట్టి పరారైన నిందితులపై ఆదివారం బాధితులిచ్చిన ఫిర్యాదు మేరకు కరప పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కరప మండలం వేములవాడలో వ్యాపారి గండి కామేశ్వరరావు ఎంతో నమ్మకంతో చిట్టీలు వేస్తూ, ఆపై అధిక వడ్డీ ఎరవేసి రూ.కోటిన్నరతో పరారైన విషయం పాఠకులకు విదితమే. కాగా అదే గ్రామానికి చెందిన గండి కృపాదానం జరిగిన మోసంపై ఫిర్యాదు చేశాడు. గతంలో మూడు చిట్టీలు వేయగా ఆ సొమ్ము ఇచ్చేయడంతో మళ్లీ ఒక్కో చిట్టీ రూ.లక్ష చొప్పున మూడు వేశానని పేర్కొన్నారు. వాయిదాలు పూర్తి కావస్తుండగా కామేశ్వరరావు, అతని కుమారుడు దుర్గారావు, భార్య విజయ, కోడలు భవానీలు ఎవరికీ చెప్పకుండా గ్రామం వదిలి పోయారని, తమలా ఇంకా చాలా మందికి ఇవ్వాల్సిన చిట్టీ సొమ్ములు, వడ్డీ ఇస్తానని చెప్పి తీసుకున్న సొమ్ము చెల్లించకుండా పారిపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు నిందితులు కామేశ్వరరావు, దుర్గారావు, విజయలక్ష్మి, మాధవిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నౌడు రామకృష్ణ తెలిపారు.

నిండు ప్రాణాలు.. నింగిలోకి

- కళ్లెం లేని వేగమే కారణం
- ఆలయంలోకి దూసుకెళ్లిన టిప్పర్
- డ్రైవర్, క్లీనర్‌తో సహా మరొకరు మృతి



ఎ.కొత్తపల్లిలో వినాయకుని ఆలయంలోకి దూసుకెళ్లిన టిప్పర్

తొండంగి: నిశి వేళలో... కళ్లెం లేని వేగం ఉసురు తీసింది.. నిండు ప్రాణాలను నింగిలో కలిపేసింది.. ఆ దారిలో మృత్యుకేళి మోగించింది.. అయినవారికి విషాదం మిగిల్చింది.. అతివేగం ఆపై నిద్రమత్తు కారణంగా టిప్పర్ తొండంగి మండలం ఎ.కొత్తపల్లిలో వినాయకుని ఆలయంలోకి దూసుకెళ్లడంతో ముగ్గురు మృత్యువాత పడిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. రౌతులపూడి మండలం నుంచి తొండంగి మండలం తీర ప్రాంతానికి టిప్పర్ వెళ్తుంది. అది అన్నవరం నుంచి తొండంగి వైపు వస్తుండగా ఎ.కొత్తపల్లిలో వేగంగా వెళ్తూ రోడ్డు పక్కన ఉన్న జీఎస్ఎల్ఆర్ ట్యాంకును ఢీకొట్టింది. వెంటనే ఎదురుగా ఉన్న వినాయకుని ఆలయంలోకి దూసుకెళ్లింది. టిప్పర్ వేగానికి వినాయకుని ఆలయం పూర్తిగా నేలమట్టం అయ్యింది. లారీ క్యాబిన్ నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ఘటనతో గజ్జనపూడి గ్రామానికి చెందిన టిప్పర్ డ్రైవర్ చుక్కల శేఖర్ (28), క్లీనర్ కానూరి సూర్యనాగేంద్ర (23) అక్కడికక్కడే మృతి చెందారు. అయితే ఆలయం వద్ద నిద్రిస్తున్న ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన తూము లక్ష్మణరావు (47) కూడా దుర్మరణం పాలయ్యారు. అక్కడ ఒక్కసారిగా భారీ శబ్దం రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో జేసీబీ సాయంతో లారీ క్యాబిన్, ఆలయ శిథిలాలను తొలగించి చుక్కల శేఖర్, కానూరి సూర్యనాగేంద్ర, తూము లక్ష్మణరావు మృత దేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు తొండంగి ఎస్సై రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లక్ష్మణరావు ఇంటి వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



మృతులు తూము లక్ష్మణరావు, చుక్కల శేఖర్, కానూరి సూర్యనాగేంద్ర

కుమార్తెకు సారె పంపి వచ్చి..

మృతుల్లో ఒకరైన లక్ష్మణరావుకు భార్య లోవలక్ష్మి, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఎ.కొత్తపల్లి గ్రామంలో కూలి పని చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 1న తన పెద్ద కుమార్తె నాగలక్ష్మి వివాహం జరిగింది. శనివారం కొమ్మనాపల్లిలో తన వియ్యపు వారింటికి కుమార్తెకు సారెను కుటుంబ సభ్యులతో కలసి తీసుకెళ్లారు. అనంతరం అర్ధరాత్రి ఒంటి గంటకు స్వగ్రామం ఎ.కొత్తపల్లికి వచ్చారు. పెళ్లింట బంధువులు ఎక్కువగా ఉండటంతో ఖాళీ లేక లక్ష్మణరావు దగ్గరలోని వినాయకుని ఆలయంలో సేద తీరారు. ఇంతలో టిప్పర్ లారీ మృత్యువు రూపంలో కబళించింది. దీంతో లక్ష్మణరావు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పెళ్లింట బంధువుల రోదనలతో విషాదం నెలకొంది.

చిన్న కుటుంబం.. పెద్ద కష్టం

ప్రత్తిపాడు రూరల్: గజ్జనపూడికి చెందిన టిప్పర్ డ్రైవర్ చుక్కల శేఖర్, క్లీనర్ కానూరి సూర్యనాగేంద్ర మృతితో ఆ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. పదేళ్లుగా డ్రైవర్‌గా పనిచేస్తూ శేఖర్ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. అతనికి భార్య లోకేశ్వరి, కుమారుడు లలిత దుర్గామనీష్ (2), కుమార్తె అనితశ్రీ (10 నెలలు) ఉన్నారు. ఆ చిన్న కుటుంబానికి అతనే ఆధారం. పెద్ద దిక్కు కోల్పోవడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది.

ప్రేమ పెళ్లి చేసుకున్న ఏడాదికే..

లారీ క్లీనర్ కానూరి సూర్యనాగేంద్ర (23) ఏడాది కిందట పాదురుపాకకు చెందిన శివకుమారిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారి జీవితం ఎంతో అన్యోన్యంగా సాగుతోంది. ఇంతలో ఈ ప్రమాదం తీవ్ర శోకాన్ని మిగిల్చింది. వివాహం కావాల్సిన సోదరితో పాటు తల్లిదండ్రులు నాగేంద్రతో ఉంటున్నారు. అతని మృతితో ఆ కుటుంబానికి ఆసరా లేకుండా పోయింది. మృతుల కుటుంబాలు ప్రధాన జీవనాధారమైన పెద్దదిక్కులను కోల్పోయి రోడ్డున పడ్డాయి.

సూర్యదేవాలయంలో ఘనంగా మహాకుంభాభిషేకం



సూర్యదేవాలయంలో స్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు



ఆలయ శిఖరంలో మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో శ్రీఉష, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత శ్రీ సూర్యనారాయణమూర్తి స్వామివారి ఆలయంలో మహా కుంభాభిషేకం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కుంభాభిషేకంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు రేజేటి రామాచార్యులు సారథ్యంలో 1001 కలశాలతో 1001 మంది దంపతులచే ఆలయ శిఖరానికి, సూర్యనారాయణమూర్తి స్వామి వారికి మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు మాట్లాడుతూ గ్రామం సుభిక్షంగా ఉండాలని దశాబ్దాల తర్వాత సూర్యనారాయణస్వామి వారికి సహస్ర కలశ మహాకుంభాభిషేకం నిర్వహించామన్నారు. అనంతరం భక్తుల కోసం అన్న సమారాధన చేశారు.

కొలిక్కి వస్తున్న బదిలీల ప్రక్రియ

- అభ్యంతరాల అనంతరం సీనియారిటీ జాబితా విడుదలకు కసరత్తు
- నేడు, రేపు గ్రేడ్-2 హెచ్ఎంల వెబ్ ఆప్షన్లు

రాయవరం: ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ ఓ కొలిక్కి వస్తోంది. ఉపాధ్యాయ బదిలీలకు ప్రభుత్వం గత నెల 21న జీఓ 47 విడుదల చేసింది. 22న బదిలీ షెడ్యూల్ విడుదల చేశారు. రెండేళ్ల అనంతరం బదిలీలు నిర్వహించడం, అలాగే జీరో సర్వీస్ ఇవ్వడంతో భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా నిర్వహిస్తున్న ఈ బదిలీలకు 8,025 దరఖాస్తులు వచ్చాయి. తప్పనిసరి బదిలీలకు ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లకు 8, గ్రేడ్-2 హెచ్ఎంలకు 5 విద్యా సంవత్సరాలను ప్రాతిపదికగా నిర్ణయించారు. ఒకపక్క ఉపాధ్యాయులు బదిలీ సీనియారిటీపై వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూనే షెడ్యూల్ ప్రకారం బదిలీల ప్రక్రియను చేపడుతున్నారు. ఉపాధ్యాయులు నిర్ణీత తేదీల్లో వెబ్ ఆప్షన్లు పెట్టుకునేందుకు అనుగుణంగా ఈ ప్రక్రియను ఎప్పటికప్పుడు ముందుకు తీసుకుని వెళ్తున్నారు. ఇప్పటి వరకూ ప్రభుత్వం ముందుగా నిర్ణయించిన ప్రకారమే బదిలీల ప్రక్రియ చేపట్టడంపై ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. బదిలీ షెడ్యూల్‌లో భాగంగా సోమ, మంగళవారాల్లో గ్రేడ్-2 హెచ్ఎంలు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాల్సి ఉంది. దీనికి సంబంధించి ఇప్పటికే గ్రేడ్-2 సీనియారిటీ తుది జాబితాలను విడుదల చేసే పనిలో విద్యాశాఖ అధికారులు తలమునకలయ్యారు. ప్రతి అభ్యంతరాన్నీ పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నారు. అలాగే గ్రేడ్-2 హెచ్ఎంల ఖాళీలు కూడా పూర్తి స్థాయిలో విడుదల కావాల్సి ఉంది. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకూ స్కూల్ అసిస్టెంట్లకు, జూన్ 5 నుంచి 8వ తేదీ వరకూ ఎస్జీటీలకు వెబ్ ఆప్షన్లు పెట్టుకునే అవకాశముంది. జూన్ 9న జీహెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్లకు, జూన్ 9 నుంచి 11 వరకూ ఎస్జీటీలకు బదిలీ కోరుకున్న స్థానాల్లో ఉత్తర్వులు వెలువడనున్నాయి.

దైవ దర్శనానికి వెళ్లి అనంత లోకాలకు..

గోదావరిలో మునిగి వ్యక్తి మృతి



రాయుడు రామకృష్ణ (ఫైల్)

పి.గన్నవరం: దైవ దర్శనానికి భద్రాచలం వెళ్లిన ఒక వ్యాపారి ఆదివారం అక్కడ నదిలో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తూ మునిగి మృతిచెందారు. దీంతో ఆయన స్వగ్రామమైన రాజులపాలెంలో విషాద ఛాయలు అలముకున్నాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని రాజులపాలెం శివారు అయినాలవారి పాలేనికి చెందిన రాయుడు రామకృష్ణ (41) పి.గన్నవరంలో స్టీల్ సామాన్ల వ్యాపారం నిర్వహిస్తున్నారు. సెలవు దినం కావడంతో ఆదివారం తెల్లవారు జామున రామకృష్ణ తన భార్య దుర్గ, కుమారులు బాలాదిత్య, మహిధర్‌లతో పాటు, బావమరిది కుటుంబ సభ్యులతో కలసి మొత్తం 8 మంది కారులో భద్రాచలం వెళ్లారు. అక్కడ గోదావరి నదిలో రామకృష్ణ స్నానమాచరిస్తూ ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోయాడు. దీనిని గ్రహించిన కుటుంబ సభ్యులు, స్థానికులు అతనిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. రామకృష్ణ మృతితో భార్య, పిల్లలు బోరున విలపిస్తున్నారు.

వైద్యుడి మృతదేహం లభ్యం



డాక్టర్ వివేక్ (ఫైల్)

యానాం: ఓ వైద్యుడి మృతదేహాన్ని ఆదివారం సాయంత్రం కనుగొన్నట్లు ఎస్సై శేరు నూకరాజు తెలిపారు. తాళ్లరేవు మండల పరిధి సుంకరపాలెం గ్రామానికి చెందిన డాక్టర్ చిక్కం వివేక్ (34) ఈ నెల 31న యానాం కనకాలపేట బైపాస్ జంక్షన్ వద్ద నుంచి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో అతని ఆచూకీ కోసం గాలిస్తున్న సమయంలో దరియాలతిప్ప వద్ద ఉన్న రిలయన్స్ జెట్టీ వద్ద సముద్రం సమీపంలో వివేక్ మృతదేహాన్ని కనుగొన్నారు. ఆయన ఇంటి నుంచి వెళ్లేటప్పుడు వేసుకున్న ప్యాంట్ తదితరాల ఆధారంగా వివేక్‌గా కుటుంబ సభ్యులు నిర్ధారణకు వచ్చారు. ఈ మేరకు మృతదేహాన్ని యానాం పోలీసులు జీజీహెచ్‌కు తరలించారు.

చోరీల కేసులో నిందితుల అరెస్ట్

రాజమహేంద్రవరం సిటీ: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ విజయశంకర్ తెలిపారు. ఆదివారం స్థానిక జీఆర్పీ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిందితుల నుంచి రూ.16 లక్షల విలువైన 276 గ్రాముల బంగారు ఆభరణాలు, 30 గ్రాముల వెండి ఆభరణాలు, ఒక ల్యాప్‌టాప్, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తరచూ దొంగతనాలకు పాల్పడుతున్న ఈ ముగ్గురిపై నిఘా ఉంచి పట్టుకున్నట్లు తెలిపారు.

విద్యార్థుల చూపు.. ట్రిపుల్ ఐటీ వైపు



- ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఈ నెల 26 తుది గడువు
- పదో తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక

రాయవరం: విద్యార్థుల చూపు.. ట్రిపుల్ ఐటీ వైపు పడింది. దీనికిగాను రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీస్ (ఆర్‌జీయూకేటీ)లో అడ్మిషన్లకు నోటిఫికేషన్ శనివారం విడుదలైంది. ఈ మేరకు 4వ తేదీ ఆదివారం నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఈ నెల 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ఉంటోంది. జూలై 13న ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల అవుతోంది. రాష్ట్రంలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో ఒక్కో చోట వెయ్యి సీట్ల చొప్పున మొత్తం నాలుగు వేల సీట్లు ఉన్నాయి. ఈ మొత్తం సీట్లకు నోటిఫికేషన్ విడుదలైంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో 48,321 మంది ఉత్తీర్ణత సాధించగా.. ఇందులో 35,001 మంది ప్రథమ, 8,974 మంది ద్వితీయ, 4,346 మంది తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ముఖ్యంగా ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన 35,001 మంది మధ్యే పోటీ ఉంటోంది.

నాడు వైఎస్సార్ చలువతో..

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అత్యున్నత సాంకేతిక విద్యనందించేందుకు 2008లో అప్పటి ముఖ్యమంత్రి, దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఇడుపులపాయ, నూజివీడు, తెలంగాణ రాష్ట్రంలోని బాసరలో ట్రిపుల్ ఐటీలు ఏర్పాటు చేశారు. ప్రారంభంలో అధిక సీట్లు కేటాయించగా, 2010లో ఒక్కో ట్రిపుల్ ఐటీలో వెయ్యి సీట్లు ఉండేలా కుదించారు. 2014లో రాష్ట్ర విభజన అనంతరం బాసర ట్రిపుల్ ఐటీ తెలంగాణకు వెళ్లిపోవడంతో 2016లో ఒంగోలు, శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీలు ప్రారంభించారు. ఈ ట్రిపుల్ ఐటీల్లో 26 జిల్లాల విద్యార్థులకు సమానంగా సీట్లు ఇచ్చేందుకు వర్సిటీ అధికారులు నిర్ణయించి నాలుగు వేల సీట్లలో ఓపెన్ కేటగిరీలో 600 సీట్లను స్థానికేతరులు, తెలంగాణ, ఎన్ఆర్ఐ తదితరులకు కేటాయిస్తారు. మిగిలిన 3,400 సీట్లను 26 జిల్లాల వారికి సమానంగా ఇస్తారు. జిల్లాకు కేటాయించే సీట్ల ఆధారంగా మెరిట్ విద్యార్థులకు అవకాశం లభించనుంది.

ఎంపిక ఎలా చేస్తారంటే..

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివిన విద్యార్థులకే ట్రిపుల్ ఐటీలో అధిక సీట్లు వచ్చే అవకాశం ఉంది. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకే ట్రిపుల్ ఐటీలో సీట్లు దక్కే అవకాశం ఉంటుంది. ఎంపిక ప్రక్రియలో భాగంగా ఇరువురు విద్యార్థులకు మార్కులు సమానంగా వస్తే తొలుత గణితం, అనంతరం జనరల్ సైన్స్, తదుపరి ఇంగ్లిషు, ఆ తదుపరి సోషల్ స్టడీస్, ఫస్ట్ లాంగ్వేజ్‌లో అధిక మార్కులు వచ్చిన వారికి ప్రాధాన్యమిస్తారు. అప్పటికీ సమానంగా వస్తే పుట్టిన తేదీ ప్రకారం అధిక వయసు ఉన్నవారిని, హాల్ టికెట్ నంబర్ నుంచి పొందిన అత్యల్ప సంఖ్య ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

ట్రిపుల్ ఐటీలో చేరేందుకు ఆసక్తి ఉన్నవారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్‌జీయూకేటీ.ఇన్/ఏపీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. బీసీ, ఓసీ విద్యార్థులకు దరఖాస్తు రుసుం రూ.300గా, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200గా నిర్ధారించారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్లు

ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్లకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తారు. రాష్ట్రంలోని అభ్యర్థులకు 85 శాతం సీట్లు, మిగిలిన 15 శాతం సీట్లు రాష్ట్ర పునర్విభజన చట్టం 2014 ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులకు కేటాయిస్తారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం.. ఎస్సీ-15, ఎస్టీ-6, బీసీ(ఎ)-7, బీసీ(బి)-10, బీసీ(సి)-1, బీసీ(డి)-7, బీసీ(ఇ)-4, దివ్యాంగులు-5, ఆర్మీ ఉద్యోగుల పిల్లలు (సీఏపీ)-2, ఎన్‌సీసీ-1, స్పోర్ట్స్-0.5, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్-0.5 శాతం సీట్లు కేటాయిస్తారు. ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ప్రత్యేక కేటగిరీల్లో బాలికలకు 33.1/3 శాతం సీట్లు కేటాయిస్తారు.

ఎప్పుడెప్పుడు ఏంటంటే..

దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: జూన్ 26, సాయంత్రం ఐదు గంటలు
స్పెషల్ కేటగిరీ అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన: (నూజివీడు క్యాంపస్)
సీఏపీ: జూలై 5, 6 తేదీలు
స్పోర్ట్స్: జూలై 6 నుంచి 9వ తేదీ వరకూ
దివ్యాంగులు: జూలై 6
భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్: జూలై 6
ఎన్‌సీసీ: జూలై 5 నుంచి 7 వరకూ
ప్రొవిజనల్ సెలక్షన్ జాబితా ప్రకటన (అదర్ దేన్ స్పెషల్ కేటగిరీ): జూలై 13
ఎంపికైన వారి సర్టిఫికెట్ల పరిశీలన (ఆర్‌జీయూకేటీ నూజివీడు, ఇడుపులపాయ క్యాంపస్‌లు): జూలై 21, 22 తేదీలు
ఎంపికైన వారికి సర్టిఫికెట్ల పరిశీలన (ఆర్‌జేయూకేటీ ఒంగోలు), పరిశీలన స్థలం: ఇడుపులపాయ క్యాంపస్‌లు: జూలై 24, 25 తేదీలు
ఎంపికైన వారికి సర్టిఫికెట్ల పరిశీలన (ఆర్‌జీయూకేటీ శ్రీకాకుళం), పరిశీలన స్థలం: శ్రీకాకుళం క్యాంపస్: జూలై 24, 25 తేదీలు
రిపోర్టింగ్ ఆఫ్ రెస్పెక్టివ్ క్యాంపసెస్: ఆగస్టు మొదటి వారంలో వెలువడే ప్రకటన ప్రకారం

కదలాడిన అలనాటి జ్ఞాపకం



గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

- ఇంటర్ విద్యార్థుల 'అపూర్వ' సమ్మేళనం
- 35 ఏళ్ల తర్వాత కలుసుకున్న వైనం

రామచంద్రపురం రూరల్: నాడు చదువులమ్మ కోవెలలో సందడి చేసిన రోజు మళ్లీ గుండె గదిలో జ్ఞాపకమై కదలాడింది. ఆగిపోయిన స్నేహగీతం రాగమై వినిపించింది. మది మదిలో కళాశాల రోజుల పేజీ ఆవిష్కృతమైంది. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను మరోసారి చూసి పూర్వ విద్యార్థుల బృందం మురిసిపోయింది. అరేయ్.. ఒరేయ్.. ఏమేవ్ అనే పిలుపులతో చదువులమ్మ ప్రాంగణం పులకించిపోయింది. దీనికి ద్రాక్షారామ శ్రీపీవీఆర్ జూనియర్ కళాశాల వేదికగా నిలిచింది. 1986-88 బ్యాచ్‌కు చెందిన ఆర్ట్స్ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం కళాశాల ఆవరణలో జరిగింది. కళాశాలను విడిచిపెట్టి వెళ్లి పోయాక ఆ హ్యాపీ డేస్‌ను తిరిగి నెమర వేసుకున్నారు. రోజులు గడిచాక స్థాయిలు మారిన ప్రస్తుత పరిస్థితుల్లోనూ తారతమ్యాలను స్నేహం దూరం చేసింది. సమాజంలో హోదా పెరిగినా కల్మషం లేని స్నేహంతో అందరూ మరోసారి నాటి విద్యార్థుల్లా మారి, స్నేహంలోని మాధుర్యాన్ని ఆస్వాదించారు. నాటి నిక్ నేమ్‌లతో పిలుచుకుంటూ మురిసిపోయారు. తమ ఉన్నతికి కారణంగా నిలిచిన నాటి గురువులు చిక్కాల గగ్గయ్య, ఇంగ్లిష్ లెక్చరర్ ప్రకాష్, నాగేశ్వరరావు, చౌదరి, మేర్నీడి మూర్తి, కళాశాల స్టాఫ్ నరసింహమూర్తి, రాఘవులను సత్కరించారు. పూర్వ విద్యార్థి అయిన ద్రాక్షారామ సర్పంచ్ జనిపల్లి అరుణకుమారి, పూర్వ విద్యార్థుల కలయికకు కారణమైన కోళ్ల శ్రీనివాస్, రాధాకృష్ణ తదితరులను కూడా సహచరులు సత్కరించారు. పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు కలిసి గ్రూపు ఫొటోకు ఫోజులిచ్చారు.

దూరాభారమని అనుకోలేదు



ప్రస్తుతం నేను శ్రీకాకుళంలో ఉద్యోగం చేస్తున్నాను. నన్ను అప్పుడు అందరూ మా ఊరిపేరుతో 'సుందరపల్లోడు' అని పిలిచేవారు. ఇప్పుడు కూడా అలాగే పిలుస్తుంటే కళాశాల రోజులు మరోసారి గుర్తుకు వచ్చాయి. స్నేహితులను కలుసుకోవడానికి దూరాభారమనిపించలేదు. -చిట్టూరి నాగేశ్వరరావు, శ్రీకాకుళం

సంతోషంగా ఉంది..



ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నాను. స్నేహితులంతా మళ్లీ కలుస్తామని ఊహించలేదు. 35 ఏళ్ల తర్వాత కలవడం చాలా సంతోషమనిపించింది. చిన్ననాటి మిత్రులనే కాదు.. నాటి గురువులను కలుసుకోవడం మరిచిపోలేని అనుభూతినిచ్చింది. మరిన్ని జ్ఞాపకాలతో వెళ్తున్నాను. -కూచి వెంకటలక్ష్మీనారాయణ (సాయి), హైదరాబాద్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



గోపాలపురం చెక్‌పోస్టు సెంటర్ వద్ద లారీ ఢీకొనడంతో డివైడర్‌పైకి వెళ్లిన కారు

గోపాలపురం: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. తాళ్లపూడి నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు గోపాలపురం చెక్‌పోస్టు సెంటర్ వద్దకు వచ్చేసరికి కొయ్యలగూడెం నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న లారీ ఒక్కసారిగా ఢీకొంది. దీంతో కారు డివైడర్ పైకి దూసుకుపోయింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.రామకృష్ణ చెప్పారు.